# శూన్యం

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

కాలం గాయం మాన్పేలోపు
మళ్ళీ రేగుతోంది
రేపటి మీది ఆశని
ఎండమావి చేస్తోంది
మైళ్ళకొద్దీ అడుగులు పడుతున్నాయి గాని
గమ్యం కనిపించడం లేదు.
చెట్టు..పుట్ట..పిట్టలతో
సావాసం నామోషిప్పుడు..
యంత్రాలతో దోస్తీ..
కాళ్ళతో కాదు చేతివేళ్ళతో
ప్రపంచయాత్ర..
తరాల మధ్య తేడాలు
తుడిచిపెట్టుకు పోయాయి
డబ్బుది మాత్రమే విశ్వరూపం
దాని ముందు అందరి సాష్టాంగ నమస్కారం!
అనుభూతులు లేని
కాగితప్పూ బ్రతుకులు
వెలుగూ చీకటీ ఒక్కటే అయినప్పుడు
బ్రతుకు శూన్యమే కదా?

****

# ఇది ప్రగతి

ఉమాదేవి పోచంపల్లి

నేడు నీ ఆలోచనలే
రేపటి నీ నిజాలు
నేటి నీ అభిప్రాయాలే
రేపటి నీ ఆచరణలు

నేటి ఈ అంధకారం పట్ల
నీ నైరాశ్యం , నిస్పృహ
రేపటి జాగృతికి ఆనకట్ట
నేటి నీ ప్రగతి
రేపటి నీ ఉన్నతి

కొన్ని అడ్డుగోడలు
కొంత అలజడి
కొన్ని మార్పులు చేర్పులు
కొంత మరపులు చెరుపులు
క్రొత్త జగం క్రొత్త యుగం

****

